క్లుప్తంగా

సహకార సంఘాలతోనే రైతు సంక్షేమం


మాట్లాడుతున్న చైర్మన్ తిరుపతిరెడ్డి

సైదాపూర్: సహకార సంఘాలతోనే రైతు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, రైతుల సహకారంతోనే సహకార సంఘాలు పటిష్టం అవుతున్నాయని సింగిల్ విండోచైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం వెన్కెపల్లి విశాల సహకార సంఘం అర్ధవార్షిక మహాసభ సంఘం కార్యాలయంలో చైర్మన్ తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకుందని, వ్యవసాయ అనుబంధ, ఇతర రంగాల్లో వ్యాపారం చేస్తూ, సహకార సంఘాలు ఆర్థికంగా బలపడ్డాయన్నారు. యూరియా కొరత నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహాసభలో డైరెక్టర్లు, సీఈవో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ గ్రామంలో శుక్రవారం యువకులు శ్రమదానం చేశారు. కొహెడ వెళ్లే ఎక్స్‌రోడ్ నుంచి ఓగులాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. చెట్ల కొమ్మలు రోడ్డు వెంట వెళ్లేవారికి తగులుతున్నాయని, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో కొమ్మలు నరికివేస్తున్నామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఎంఢ్ర అనిల్, నాయకులు బద్దం నారాయణరెడ్డి, కవ్వంపల్లి రామ్, జెల్ల హరీశ్, నవీన్, బోయిని రంజిత్, తాటిపెల్లి ప్రకాశ్, లక్ష్మణ్ పలువురు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శంకరపట్నం: టీబీ రహిత గ్రామాలకు కృషి చేద్దామని ఎంపీడీవో కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం టీబీ రహిత గ్రామ పంచాయతీల పోస్టర్‌ను ఎంపీవో ప్రభాకర్, కార్యదర్శులతో కలిసి ఆవిష్కరించారు. టీబీ సోకినవారు ఆరుమాసాల పాటు మందులు వాడితే నయమవుతుందన్నారు. ప్రతీ గ్రామాన్ని టీబీ రహితంగా తీర్చిదిద్దుదామన్నారు.

రక్తహీనత పరీక్షలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు రక్తహీనత పరీక్షలు చేశారు. వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి రక్త హీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు వివరించారు.

చెత్త తొలగింపు



జమ్మికుంట: పట్టణంలో స్వచ్ఛతాహీసేవాలో భాగంగా శుక్రవారం నాయిని చెరువు వద్ద ప్లాస్టిక్, గడ్డి తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు చేపట్టారు. మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పని చేయాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం, అకౌంటెంట్ అనిల్ బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల గుర్తింపు సర్వే

హుజూరాబాద్: పట్టణంలో వీధి వ్యాపారుల గుర్తింపు సర్వేను మెప్మా నిర్వహిస్తుంది. మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారం చేసుకునే వారికి ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు లోక్ కళ్యాణ్ మేళా సర్వే నిర్వహిస్తున్నట్లు మెప్మా సీఎల్‌ఆర్పీలు రమాదేవి, స్వరూపలు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో కరోనా సమయంలో పట్టణంలోని సుమారు 2000 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించామని, తిరిగి వీధి వ్యాపారుల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు కార్డులు ఇచ్చినా అనంతరం రుణాలు లభిస్తాయన్నారు.

కుంగిన రోడ్డుతో ఇబ్బందులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల శివారులో రోడ్డు కుంగడంతో వారం రోజుల నుంచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు నీరు వెళ్లేందుకు రోడ్డు మధ్యలో సిమెంటు పైపులైన్ వేశారు. పైపులైన్ పగలడంతో రోడ్డు రెండు వైపుల కుంగింది. దీంతో కొండపల్కల, గంగిపల్లి, ఎరడపల్లి, అర్కండ్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్కండ్లకు వెళ్లే ఆర్డినరీ బస్సు కుంగిన చోట ఆగిపోయింది. బస్సులోని ప్రయాణికులు సమీపంలోని బండరాళ్లను గుంతలో వేయడంతో బస్సు గమ్యస్థానానికి చేరుకుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు కుంగిన చోట మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరారు.


కుంగిన చోట గుంత పూడ్చుతున్న ప్రయాణికులు


గన్నేరువరం: వేడుకల్లో ఉపాధ్యాయులు


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నరేందర్‌రెడ్డి

ముందస్తు బతుకమ్మ

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల క్యాంపస్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ అర్యన్ కౌశిక్, అకాడమిక్ డైరెక్టర్ మహలక్ష్మి మాట్లాడారు. రాష్ట్రంలో తొమ్మిది రోజుల పాటు మహిళలు సాంప్రదాయంగా జరుపుకునే అతిపెద్ద పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చారు.

రామడుగు: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులు గన్నేరువరంలోని విద్యావనరుల కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ మూల కేంద్రమని మండల విద్యాధికారి రామయ్య తెలిపారు. మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు సంప్రదాయక దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో పోటాపోటీగా బతుకమ్మలను పేర్చి అలంకరించారు. విద్యార్థుల తల్లులకు బతుకమ్మలను పేర్చే విధానం, బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఈ.ప్రసాద రావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, ప్రసూన, రశ్మిత, వినోదరావు, ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉమేశ్‌కుమార్ అన్నారు. సూర్యనగర్‌లోని శుభం గార్డెన్‌లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, కల్చరల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. శారద ఉమేశ్‌కుమార్, అల్ఫోర్స్ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.రజిత, జె.ఆంజనేయులు, సంతోష్, రమేశ్, అధ్యాపకులు, కల్చరల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను కొత్తపలి చెరువులో నిమజ్జనం చేశారు.

సినీ నటుడు శ్రీకాంత్ సందడి

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సినీ నటుడు శ్రీకాంత్ సందడి చేశారు. బతుకమ్మ పండుగకు విశిష్టమైన ఖ్యాతి ఉందన్నారు. సినీ దర్శకులు నాగేశ్వర్‌రెడ్డి, నిర్మాతలు చందు, వెంకట్, డాక్టర్ వనజా నరేందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రామడుగు: గోపాల్‌రావుపేటలో...


అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో..


జమ్మికుంటలో...


పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌లో

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




హుజూరాబాద్: ఉత్తమ ఉపాధ్యాయులతో విద్యాధికారులు, చొప్పదండి: రాగంపేటలో సన్మానం

చొప్పదండి: జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న మండలంలోని రాగంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బిజిలి కనుకయ్య జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని కొనియాడారు. అలాగే ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సాయన్నను సన్మానించారు. హెచ్ఎం రవీందర్, గాయకుడు గసికంటి కుమార్, దీకొండ కుమారస్వామి, రమణసాయి, అంజయ్య, సంపత్, శేఖర్, కుమార్, గణేశ్, మహేశ్, అంజిబాబు, సాగర్, మహేశ్, సుధాకర్, తదితదరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. హెచ్ఎం నీరజ, తెలుగు టీచర్ ఆదిలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడంతో సహచార టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఉత్తమ ఉపాధ్యాయులకు మండల స్థాయి అవార్డుల ప్రదాన కార్యక్రమం శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మండల విద్యాధికారి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమాజ అభివృద్ధి కోసం ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ... రేపటి తరం బాగుండాలంటే ఉపాధ్యాయులతోనే సాధ్యమన్నారు. ఆయా సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన 17 మంది ప్రభుత్వ, 14 మంది ప్రైవేటు టీచర్లను ప్రశంసా పత్రాలు, శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు భాగ్యరేఖ, ఆదర్శన్ రెడ్డి, చక్రధర్, సంజీవ్, శ్రీనివాస్, సంపత్, సీఆర్పీలు పాల్గొన్నారు. అవార్డుల జాబితాపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభ్యంతరం తెలిపారు.

మెట్‌పల్లిలో కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో శుక్రవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 52 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామ కూడలిలో ఏసీపీ మాధవి మాట్లాడారు. విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలను వివరించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్సై శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం


అనిల్‌ను అభినందిస్తున్న కొనగాల మహేశ్

గన్నేరువరం: మున్నూరుకాపు గన్నేరువరం మండల యూత్ అధ్యక్షుడిగా కొలువుల అనిల్‌పటేల్ నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు గంప మహేశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేశ్‌కు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరుకాపు బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు 15 మంది జీపీవో (గ్రామపాలన అధికారులు)లను ప్రభుత్వం నియమించినట్లు తహసీల్దార్ ఎం. రమేశ్ శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు 13 మంది మాత్రమే విధుల్లో చేరారని, చిగురుమామిడి-1 వి రమేశ్‌రెడ్డి, చిన్నముల్కనూర్‌కు -ఎస్ రజిత, రామంచకు- ఎం కొంరయ్య, రేకొండ-1 జే భూమయ్య, ఉల్లంపల్లికి-టి రాములు, సుందరగిరి-1 జి అనిత, నవాబుపేట్-వి శ్రీనివాస్, కొండాపూర్-జి అంజయ్య, ఇందుర్తి-1 టి. బాలరాజ్, ఇందుర్తి-2 కె. బాలయ్య విధులో చేరారని, బొమ్మనపల్లి, చిగురుమామిడి-2, రేకొండ-2కు జీపీవోలు రావాల్సి ఉందన్నారు. రైతులు భూ సమస్యల పరిష్కారానికి గ్రామాలకు కేటాయించిన జీపీవోలను సంప్రదించాలని కోరారు.

వీవోఏ, సీసీలకు శిక్షణ


మాట్లాడుతున్న డీపీఎం తిరుపతి

మానకొండూర్: మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం వీవో, సీసీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వశక్తి, గ్రామ సంఘాలు, మండల సమైఖ్యల పుస్తక నిర్వహణ, అంతర్గత ఆడిట్ నిర్వహణ, ప్రతినెలా తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకొని పుస్తకాలు రాయాలని తెలియజేశారు. బ్యాంకు లోన్లు తీసుకొని ఆదాయ అభివృద్ధి, కార్యక్రమాలు చేపట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం, తిరుపతి ఏపీఎంలు రాజేందర్, భార్గవ్, సీసీలు జ్యోతి, ఎల్లయ్య, మురళి, కనుకయ్య, చంద్రమౌళి, సులోచన, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ షూ పంపిణీ

చొప్పదండి: మండలంలోని రెవెళ్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.25 వేల ట్రాక్ షూ సదిశ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఉచితంగా అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముచ్చర్ల గోవర్ధన్‌రెడ్డి సహకారంతో విద్యార్థుల కోసం ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం సిరిపురం ఆనందం మేరకు పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో దుస్తులు పంపిణీ చేశారు. మండల స్థాయిలో గతంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన కె. సాహిత్య, ఏ. వైష్ణవికి నగదు ప్రోత్సాహకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ప్రవీణ్‌రెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, దుబ్బపల్లి పాఠశాల విద్యార్థులకు రామగిరి అనూష స్మారకార్థం తల్లిదండ్రులు, మత్స్యగిరీంద్రస్వామి ఆలయం ధర్మకర్త రామగిరి తిరుమలసంపత్ శుక్రవారం అరటిపండ్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు పండ్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు.



శంకరపట్నం: మండలంలోని తాడికల్ క్రీడాప్రాంగణం వద్ద తారురోడ్డు పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయి. చింతగుట్ట గ్రామం నుంచి తాడికల్ వరకు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. తాడికల్ సహకార సంఘం భవనం వద్ద ఎస్సారెస్పీ స్థలం అని అధికారులు రోడ్డు పనులు అడ్డుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిన రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మల్లేశం, ఏఈ, పంచాయతీరాజ్, శంకరపట్నం సెల్ నంబర్: 8309744022

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చెస్ నెట్‌వర్క్, మున్సిపాలిటీల సంయుక్త ఆధ్వర్యంలో 27న జరిగే చెస్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. చదరంగంతో మానసికంగా, ఆలోచనపరంగా మనిషి అభివృద్ధి చెందుతాడని, బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బాలికలు, మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొంత మంది ఎన్నారైలు చెస్ నెట్ వర్క్ స్థాపించి చదరంగం క్రీడ ప్రోత్సహిస్తున్నారని, ఆసక్తి కలిగిన బాలికలు, మహిళలు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మూడు ఏజ్ గ్రూపుల్లో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, డాక్టర్ సరళ, ఝాన్సీరాణి, డాక్టర్ రేణుక, సుమలత, స్వప్న, రమ, ఓదెలు, డాక్టర్ స్వరూపరాణి, విజేందర్ రెడ్డి, మురళీమోహన్, తులసీదాస్, వనమాల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. కిరణ్, వినయ్, రమేష్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం




చిగురుమామిడి: కొండాపూర్ అంగన్‌వాడీలో వంటల పోటీలు, గన్నేరువరం: జంగపల్లిలో


మానకొండూర్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని నిజాయతీగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార దినోత్సవం నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్, ఐరన్‌లోపం తదితర విషయాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సరిత, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార దినోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం తయారు చేయాలని పురుషులకు వంటల పోటీలు నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ ఇస్రాత్ సుల్తానా సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు కవిత, అంగన్‌వాడీ టీచర్ శారద, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమాదేవి

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సహజంగా లభించే మునగ, తోటకూరలో మంచి పోషకాలు ఉంటాయని తెలిపారు. అనంతరంసూపర్ వైజర్ కవిత పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. తండ్రులకు వంటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, సరోజన, ఆశ వర్కర్లు శ్యామల, లావణ్య, తల్లులు పాల్గొన్నారు.

ప్రవక్త జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి


ఎక్స్‌పోను సందర్శిస్తున్న నరేందర్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): మహ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని శుక్రవారం జ్యోతిరావుపూలే మైదానంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన ఎక్స్‌పో 2025ను ప్రారంభించి సందర్శించారు. మహ్మద్ ప్రవక్త సూక్తులు యావత్తు మానవాళికి అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు షోహైబ్ అహ్మద్ ఖాన్, ప్రతినిధులు మహ్మద్ ఖైరుద్దీన్, ఉమేర్ అహ్మద్ ఖాన్, ఇస్‌హాఖ్, నయిం, తన్వీర్ అహ్మద్‌ఖాన్, సయ్యద్ మెయిన్ అహ్మద్, సయ్యద్ జుబేర్ అహ్మద్, లక్ష్య్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ముస్తాక్ అలీ, నవాబ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఫసియొద్దీన్ నవాబ్, ఎంఐఎం నాయకుడు అబ్బాస్ సమీ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మున్సిఫ్ కోర్టు మంజూరు చేయాలి**

సైదాపూర్: సైదాపూర్ మండలానికి మున్సిఫ్ కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేటాయించాలని మండలంలోని న్యాయవాదులు హుజూరాబాద్ సీనియర్ జడ్జి కిరణ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

◆ **మిర్చి యార్డు సందర్శన**

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, పాలక వర్గం స్టడీ టూర్‌లో భాగంగా ఏపీలోని గుంటూరు మార్కెట్ మిర్చి యార్డును శుక్రవారం సందర్శించారు. క్రయ విక్రయాలు, రైతులకు అందిస్తున్న సేవలపై మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి చంద్రకళ, గ్రేడ్-3 కార్యదర్శి శ్రీకాంత్‌లను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

◆ **నాయకుల సంబరాలు**

గన్నేరువరం: కరీంనగర్ నుంచి గన్నేరువరం మండలానికి మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జీవోను విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపినందుకు శుక్రవారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

◆ **గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి**

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో శుక్రవారం గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల్దీప్‌సింగ్ ఓ హోటల్ వద్ద కుప్పకూలిపోగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని హుజూరాబాద్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

◆ **ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో శుక్రవారం ఆర్టీసీ డ్రైవర్‌పై యువకులు దాడి చేశారు. హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సు డ్రైవర్‌పై మొలంగూర్ ముగ్గురు యువకులు దాడి చేశారు. డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

◆ **రోడ్డు ప్రమాదంలో గాయాలు**

శంకరపట్నం: మెట్‌పల్లి గ్రామ శివారులో పాము అడ్డురావడంతో బైక్ పై నుంచి కిందపడటంతో జీపీవోకు తీవ్రగాయాలయ్యాయి. ఇల్లందకుంట మండలానికి చెందిన విక్రమ్‌రెడ్డి మెట్‌పల్లిలో గ్రామపాలన అధికారిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

◆ **ఇసుక వాహనం పట్టివేత**

గన్నేరువరం: ఇసుక అక్రమంగా తరలిస్తున్న బోలెరో వాహనాన్ని గురువారం అర్ధరాత్రి గన్నేరువరం శివారులో పట్టుకున్నామని ఎస్సై నరేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యక్తి చొక్కారావుపల్లె శివారులోని వాగు నుంచి గ్రామ ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంపు చేసుకొని బొలెరో వాహనంలో సిద్దిపేట్లకు తరలిస్తుండగా పట్టుకున్నామని, ఎస్కార్ట్ వాహన సమాచారాన్ని ఎప్పటికప్పుడు శివకుమార్‌కు అందిస్తున్న వ్యక్తి కారును వాహన తనిఖీల్లో పట్టుకున్నామని, వాహనాలను సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

◆ **డ్రంకెన్‌డ్రైవ్**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో శుక్రవారం కరీంనగర్-వరంగల్ రహదారిపై పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను పడిపిన పలువురిపై కేసు నమోదు చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.